ప్రజాశక్తి
మంగళవారం 8 నవంబర్ 2022 5
శ్రీ సత్యసాయి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పరిశ్రమలకు ప్రోత్సాహం

◆ పిఎంఇజిపి రుణాలను సకాలంలో గ్రౌండింగ్ చేయాలి
◆ కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉన్న నేపథ్యంలో దీనిపై విస్తత ప్రచారం కల్పించి అవుత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మరింత ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు మండల స్థాయిలో జరిగే పరిశ్రమల శాఖ ఎపిఐఐసి, బ్యాంకర్లు సంబంధిత అధికారులతో మరింత అవగాహన కల్పించాలన్నారు. ముందుగా ప్రధానమంత్రి ఉపాధి కార్యక్రమం (పిఎంఈజిపి) కింద ఎపి కెవిఐబి, కెవిఐసిలను సమీక్షిస్తూ లక్ష్య సాధనలో పురోగతి మెరుగుపడాలని, రాబోయే బ్యాంకర్ల సమావేశంలో ఎల్‌డిఎం.వాటికి అనుబంధ బ్యాంకులు రుణాలు ఇచ్చేలా సత్వరమే గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవడానికి చర్చ జరుగుతుందని సూచించారు. జిల్లాలో పరిశ్రమల ప్రమాదాల నివారణకు కమిటీ చర్యలు చేపట్టిందని, తరచూ తప్పనిసరి సంబంధిత అధికారులు సేఫ్టీ మెజర్మెంట్‌పై అవగాహన కల్పించి తప్పనిసరి అమలు చేసేలా చూడాలని ఆదేశించారు. పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు వివిధ శాఖల అధికారుల వద్ద ఉన్న పెండింగ్ అంశాలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అవుత్సాహిక పారిశ్రామికవేత్తలకు గుర్తించి వారిని అభివద్ధి చేయాల్సి బాధ్యత మీ పైన ఉన్నదని తెలిపారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం, ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన కార్యక్రమం (పిఎంఇజిపి) కింద ఎస్సీ, ఎస్టీ, మహిళ పారిశ్రామికవేత్తలకు తయారీ పరిశ్రమలకు రూ.50 లక్షల వరకు, సేవారంగలో పరిశ్రమల ఏర్పాటుకు రూ.20 లక్షల వరకు రుణ సహకారం ఉందని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం.చాంద్‌బాషా, నాబార్డు ప్రతినిధి ఉషచరణ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.మురళీమోహన్, డిక్కీ ప్రతినిధి కె.వెంకటరమణ, తిలక్, హరికుమార్, కమిటీ మెంబర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కడప-అనంతపురం-కర్నూలు శాసనమండలి నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో సందేహాలు, ఓటు హక్కు తదితర వివరాలు తెలుసుకునేందుకు పుట్టపర్తి కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.బసంత్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే కాల్ సెంటర్ నెంబర్ 9398867473, ల్యాండ్ నెంబర్.08555-292432ను సంప్రదించాలని తెలియజేశారు.

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనంతపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు

కాంట్రాక్టరు, అధికారుల మధ్య సత్యసాయి వాటర్ వర్కు్స కార్మికులు నలిగిపోతున్నారు. 17 నెలలుగా వారికి రావాల్సిన గ్రాట్యుటీ చెల్లించలేదు. ఈ సమస్యను అధికారులు కాంట్రాక్టర్‌పైనా, కాంట్రాక్టరు అధికారులపైనా చెబుతున్నారు. ఇలా ఇద్దరి మధ్య కార్మికులు నలిగిపోతున్నారు. ఈ సమస్యల పరిష్కారంపై గత కొన్ని రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితుల్లో లేకపోవడం శోచనీయం. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంపై కూడా అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుండడంపై కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'సత్యసాయి' కార్మికులతో చెలగాటం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి బాబా వాటర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. పూర్తయిన తరువాత 1998లో సత్యసాయి బోర్డును ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కలెక్టర్ ఆధ్వర్యంలో సత్యసాయి వాటర్ వర్కు్స నిర్వహణ నడుస్తూ వచ్చింది. దీని కాంట్రాక్టర్‌గా ప్రారంభం నుంచి ఎల్అండ్‌టి సంస్థ వ్యవహరిస్తూ వచ్చింది. ఈ సంస్థ 2021 జూన్ నెల నుంచి కాంట్రాక్టు నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. అయితే నిర్వహణ ప్రారంభమైనప్పటి నుంచి 572 మంది కార్మికులు ఈ సంస్థలో పనిచేస్తూ వచ్చారు. ఇందులో కొంత మంది చనిపోగా, మరికొంత మంది వయసురిత్యా ఉద్యోగ విరమణ పొందారు. ఎల్అండ్‌టి సంస్థ కాంట్రాక్టు బాధ్యతల నుంచి తప్పుకోవడంతో కార్మిక చట్టాల ప్రకారం వారి సీనియార్టీని బట్టి గ్రాట్యుటీని చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ గ్రాట్యుటీని ఎల్అండ్‌టి ఇప్పటికీ చెల్లించలేదు. దీన్ని చెల్లించాలని కార్మికులు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు.

ఒకరిపై ఒకరు

గ్రాట్యుటీని చెల్లించాలని కార్మికులు కాంట్రాక్టు సంస్థ అయిన ఎల్అండ్‌టీని కోరారు. అయితే ఎల్అండ్‌టి సంస్థ తమకు ప్రభుత్వం నుంచి ఇంకా రూ.32 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని, అందులో గ్రాట్యుటీకి చెల్లించాల్సింది గరిష్టంగా పది కోట్లలోపే ఉంటుంది. అది పట్టుకుని తక్కిన మొత్తాన్ని తమకు చెల్లించాలని అధికారులకు విజ్ఞప్తి చేసియున్నామని చెబుతున్నారు. అధికారులేమో ముందుగా గ్రాట్యుటీ కార్మికులకు చెల్లిస్తే బిల్లులు చెల్లిస్తామని చెబుతున్నారు. ఈ రకంగా ఇద్దరి మధ్య పితలాటకం నడుస్తోంది. సమస్య పరిష్కారానికి జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిర్వహణ ముక్కలు చేసేందుకు కుట్ర..?

రెండు దశాబ్దాలుగా నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ అయిన ఎల్అండ్‌టి తప్పుకోవడం వెనుక కూడా పెద్ద రాజకీయపరమైన ఒత్తిళ్లే ఉన్నట్టు ఆరోపణలున్నాయి. నియోజకవర్గాల వారీగా నేతలు ఒత్తిళ్లతోనే ఆ సంస్థ నిర్వహణ నుంచి తప్పుకున్నారన్న ప్రచారం సాగుతోంది. 2021లోనే ఈ ప్రయత్నాలు సాగినప్పటికీ ఆరోపణలు రావడంతో వెనక్కు తగ్గారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి నియోజకవర్గాల వారీగా నిర్వహణ బాధ్యతలను చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

సమ్మె విరమించం

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

అనంతపురం కలెక్టరేట్ : శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు, గ్రాట్యుటీ డబ్బులు ఇచ్చేంత వరకు సమ్మె విరమించేది లేదని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం 10వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ పిలిపించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గ్రాట్యుటీ డబ్బులకు సంబంధించి ఖచ్చితమైన సమాధానం చెప్పకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. అక్కడే రెవెన్యూభవన్ ఆవరణంలో బైటాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు మాట్లాడుతూ ఎల్అండ్‌టి కంపెనీ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వద్ద కార్మికులకు రావాల్సిన రూ.32 కోట్ల గ్రాట్యుటీ డబ్బు ఉందని దానిని తీసుకోవాలంటూ చెబుతుంటే, అధికారులు మాత్రం కంపెనీ వారు ఆ విధంగా లేఖ ఇవ్వాలంటూ మెలిక పెట్టారన్నారు. ఇద్దరిని కలిపి సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత కలెక్టర్‌కు ఉందన్నారు. తక్షణమే గ్రాట్యుటీ అందేలా చూడాలన్నారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో భాగంగా అవసరమైతే జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, కార్యదర్శి ఎన్.మహబూబ్‌బాషా, కోశాధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

ఇద్దరి మధ్య కార్మికులు నష్టపోతున్నారు ...

అటు కాంట్రాక్టర్, ఇటు అధికారుల మధ్య కార్మికులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టు నుంచి ఎల్అండ్‌టి సంస్థ తప్పుకున్నందున ఆ సంస్థ చెల్లించాల్సిన గ్రాట్యుటీని చెల్లించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా కార్మికులు ఆందోళనలు చేపడుతున్నారు. గ్రాట్యుటీ చెల్లించి సమ్మె విరమింపజేయాలని అధికారులను కోరుతున్నా, పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నాం. లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం.

జి.ఓబులు,
గౌరవ అధ్యక్షులు శ్రీ సత్యసాయి
వాటర్ సప్లయ్ వర్కర్సు యూనియన్.

ఆందోళన చేస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

కార్మికుల ఐక్యతతో ప్రభుత్వంలో కదలిక

ప్రజాశక్తి-తాడిమర్రి

సమస్యలు పరిష్కరించాలని సిఐటియు అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె వల్ల ఎట్టకేలకూ ప్రభుత్వంలో కదలిక వచ్చింది. దాదాపు 11 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రభుత్వం స్పందించి రెండు నెలల వేతనాలను కార్మికుల అకౌంట్లలో వేశారు. మిగిలిన రెండు నెలల జీతాలతోపాటు గ్రాడ్యుటీ ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు కార్మికుల మధ్య తగాదాలు పెట్టకుండా కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ స్పందించి మిగిలిన రెండు నెలలు జీతాలతోపాటు గ్రాడ్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డ్రోన్ స్ప్రేయింగ్‌తో సమయం ఆదా..

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మల్లీశ్వరి

ప్రజాశక్తి-బత్తలపల్లి

డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మల్లీశ్వరి

రైతులు పంటలకు వ్యాపించే తెగుళ్ల నివారణకు డోన్ సాయంతో మందు పిచికారి చేసుకుంటే సమయంతోపాటు, నీరు తక్కువగా పడుతుందని రెడ్డిపల్లికి చెందిన కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మల్లీశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో ఎంపిపి గుర్రం వనజ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కంది, చీనీచెట్లలో డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారి చేసి చూపించారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ డ్రోన్ స్ప్రేయింగ్ వల్ల తక్కువ సమయంలో కనీసం పది నిమిషాల వ్యవధిలో ఎకరాకు మందు పిచికారి చేయవచ్చన్నారు. సాధారణంగా నార్మల్ సాక్ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్లలో వాడే స్ప్రే ఫ్లూయిడ్ కంటే డ్రోన్ స్ప్రేయర్‌లో చాలా తక్కువ నీళ్లను వాడటం వల్ల నాజల్ పాస్టర్ సైజ్ సూక్ష్మంగా ఉండి పురుగు మందు ఎఫికేసి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మాధవి, రైతులు బొంతల నారాయణస్వామి, అదుగ ఈశ్వరయ్య, లోకనాథరెడ్డి, ఆదినారాయణ, నారాయణస్వామి, రామాంజనేయులు, కాటమయ్య, ఆదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు గైర్హాజరైతే చర్యలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రతి సోమవారం మండల కేంద్రంతోపాటు, గ్రామ సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ యుగేశ్వరీదేవి, ఎంపిడిఒ సాయిమనోహర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధికారులు సమయానికి హాజరుకాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక నుంచి అధికారులు ఉదయం 10 గంటలకు స్పందనలో తప్పక ఉండాలన్నారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో 9 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో మండల ఇంజినీర్ రమణయ్య, ఎంత చాముండేశ్వరి, ఎఒ ఓబిరెడ్డి, ఎపిఎం సుదర్శన్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వరలక్ష్మి, ఎపిఒ ఆదెప్ప, ట్రాన్స్ కో ఎఇ శివయ్య, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని సాంస్కృతిక మండలిలో ఈనెల 2 నుంచి 7వ తేదీ వరకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్యు ప్రెషర్ వైబ్రేషన్ అండ్ మ్యాగ్నెటిక్ థెరఫీ ఉచిత వైద్యశిబిరం సోమవారంతో ముగిసినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, రామకృష్ణ, కోశాధికారి జయసింహ తెలిపారు. ఈ సందర్భంగా 470 మందికి రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఆర్కే శర్మ, సహాయకులు పవన్ కుమార్ రోగులకు చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శర్మ మాట్లాడుతూ ఆక్యు ప్రెషర్ అనేది ఒక సహజ సిద్ధమైన వైద్య ప్రక్రియ అన్నారు. ఈ ప్రక్రియ ద్వారా రక్త ప్రసరణ సక్రమమైన రోగనిరోధక శక్తి పెరిగేందుకు తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దారెడ్డి, సుదర్శన్ గుప్తా, మనోహర్ గుప్తా, నాగభూషణం, శివయ్య, నరేంద్రరెడ్డి, రమేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగిపై దాడి హేయం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మున్సిపల్ ఉద్యోగి కృష్ణపై వైసిపి కౌన్సిలర్ జేసీబీ రమణ చేసిన దాడి హేయమైన చర్య అని మున్సిపల్ అధికారులు అన్నారు. ఉద్యోగిపై దాడికి నిరసనగా సోమవారం భోజన విరామ సమయంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతోపాటు, ఇఇ సత్యనారాయణ, మేనేజర్ ఆనంద్ తదితరులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలో తమ విధులకు ఆటంకం కల్గించడం సరికాదన్నారు. కార్యాలయ ఉద్యోగి కృష్ణపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వీటిపై పోలీసులు కూడా కేసు నమోదు చేశారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదన్నారు. ఈ నిరసనలో మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

వైసిపి కౌన్సిలర్‌ను అరెస్టు చేయాలి : సిపిఎం

మున్సిపల్ ఉద్యోగి కృష్ణపై దాడి చేసిన వైసిపి కౌన్సిలర్ జేసీబీ రమణను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు అరెస్టు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగి కృష్ణ విధి నిర్వహణ నిమిత్తం నోటీసులు ఇవ్వడానికి వెళ్లితే అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు దాడులకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలు రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయనివ ంండిపడ్డారు. ఇకనైనా ఇలాంటి దాడులు, దౌర్జన్యాలు మానకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాషా, సిఐటియు మండల అధ్యక్షులు ఎల్.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కమిషనర్ మల్లికార్జున, ఉద్యోగులు

జాతీయ స్థాయిలో ధర్మవరం కరాటే విద్యార్థుల సత్తా

ధర్మవరం టౌన్ : ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు కర్నాటక రాష్ట్రంలోని ఉడిపిలో జరిగిన బోడోకాన్ కరాటే 41వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ధర్మవరం మల్టీస్టార్ ఆల్ ఇండియా బుడోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు తమ ప్రతిభను చాటారని కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 16 రాష్ట్రాలకు చెందిన 1800 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరితో ఆంధ్రప్రదేశ్ తరపున ధర్మవరం మల్టీస్టార్ ఆల్ ఇండియా బుడోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొని సత్తాచాటారన్నారు. ప్రతిభ చాటిన వారిలో పి.మహిధర్, కట్ విభాగంలో వి.యేసురాజు, జె.నిశాంత్‌సాయి, ఎస్.షాహిర్, కట్ విభాగంలో మోక్షిత్ కుమార్ బ్రాంచ్ మెడల్, కుమ్మితే ఫైట్ విభాగంలో పి.మహిధర్ బ్రాంచ్ మెడల్, నిశాంత సాయి బ్రాంచ్ మెడల్, సాహిర్ బ్రాంచ్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ

బత్తలపల్లి : మండల కేంద్రంలోని బాలుల ఉన్నత పాఠశాలను ఎంఇఒ చాముండేశ్వరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద కింద విద్యార్థులకు పెడుతున్న భోజనం రుచి చూశారు. అనంతరం విద్యార్థులతో చిక్కీలు, గుడ్లు ఇస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు అన్నీ ఇస్తున్నారు.. రుచిగా భోజనం పెడుతున్నారని సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు జాన్, తదితరులు పాల్గొన్నారు.

9న జగనన్న క్రీడా సంబరాలు

ధర్మవరం టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 9న జగనన్న క్రీడా సంబరాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 సంవత్సరాలు పైబడిన విద్యార్థినీ, విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పాల్గొనాలనుకునే వారు జగనన్న స్పోర్ట్స్ క్లబ్ అనే యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిని విడుదల చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అక్రమంగా అరెస్టు చేసిన సత్యసాయి జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వరదరాజులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మడకశిర ఐసిడిఎస్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని లేనిపక్షంలో ఎమ్మెల్సీ తిప్పేస్వామిని ఇంటిని ముట్టడిస్తామని మంజునాథ్ పిలుపునివ్వడంతో స్థానిక పోలీసులు అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. దీన్ని బట్టి చూస్తే వైసిపి నిరంకుశ పాలన అర్థం అవుతుందన్నారు. కావున మంజునాథ్‌ను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్జల సుబ్రమణ్యం, మల్లేనిపల్లి వీరా, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

స్థానిక కదిరి గేటు వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌లో టిడిపి నాయకులు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబు పేదల కడుపునిండా అన్నం తినాలన్న ఆలోచనతో అన్నక్యాంటీన్‌ను తీసుకొచ్చారన్నారు. అప్పట్లో లక్షలాది మంది పేదలు కడుపునిండా భోజనం చేశారన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్నా క్యాంటీన్లను తొలగించడం బాధాకరమన్నారు. పేదల కడుపు కొట్టిన ఎవరైనా సరే పతనం తప్పదని హెచ్చరించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా దాతల సహకారంతో ప్రతి సోమవారం అన్నాక్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, సీనియర్ నాయకులు పథకమార్, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, నాయకులు పెద్దన్న, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, పరిశే సుధాకర్, నాగూరుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, అంబటి పనత్, గరుడంపల్లి చంద్రశేఖర్, అంజి పాల్గొన్నారు.

మండల సర్పంచుల సంఘం ఏర్పాటు

లేపాక్షి : మండలం పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో సమావేశం ఏర్పాటు చేసి మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా పులమతి సర్పంచి అశ్వర్థనారాయణ, ఉపాధ్యక్షులుగా సిరివరం సర్పంచి నేత్రావతి, ప్రధాన కార్యదర్శిగా కొండూరు సర్పంచు సిద్దప్ప ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి సర్పంచి ఆదినారాయణ, బిసలమానేపల్లి సర్పంచి నాగేంద్ర, వైసిపి మండల కన్వీనర్ నారాయణ స్వామి, నాయకులు శ్రీనివాసులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చాగలేరులో ఫ్యామిలీ ఫిజిషియన్

చిలమత్తూరు : మండల పరిధిలోని చాగలేరు పంచాయతీలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలతో పాటు గ్రామాలలోని రోగులకు చికిత్స నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామక్రిష్ణ, వైద్యసిబ్బంది, సర్పంచి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రైతుభరోసా వర్తింపు

చిలమత్తూరు : రైతు భరోసా పథకం వర్తింపుకు అర్హులై ఉండి ఇప్పటి వరకు నమోదు చేసుకోని దరఖాస్తు చేసుకోవాలని ఎ.ఒ వంశీకృష్ణ కోరారు. కొత్తగా భూమి పాస్ బుక్ చేసుకున్న వారు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

గాండ్లపెంట : మండల పరిధిలోని సోమయాజులపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిపి జగన్మోహన్ సోమవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ఆయా మాత్రమే విధులు నిర్వహిస్తుండటాన్ని గమనించి సూపర్వైజర్ తో మాట్లాడారు అంగన్వాడీ కార్యకర్తలు సెలవులో ఉన్నట్లు తెలిపారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికారం క్రమం తప్పకుండా అందించాలని ఆదేశించారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు సోమవారం పుస్తకాలు, దేశ నాయకుల చిత్రపటాలను అందజేశారు. చామలగొంది పంచాయతీలోని రెడ్డివారి పల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసులు ఉద్యోగం పొంది 13 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తన సొంత ఖర్చుతో కటారుపల్లి పాఠశాలలో విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జగన్మోహన్, ఎంఇఒ కృష్ణనాయక్, హెచ్ఎం పురుషోత్తం, స్థానిక సర్పంచి గంగోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

కదిరి టౌన్ : మండల పరిధిలోని గ్రామాల్లో ప్రతి ఒక్కరికి గృహ నిర్మాణాలు మంజూరును వేగవంతం చేయాలని ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి అధికారులను సూచించారు. సోమవారం కదిరి మండలంలోని ఎర్రదొడ్డి మరియు కాళసముద్రం, పట్నం గ్రామ పంచాయతీల్లో హౌసింగ్ పనులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రాధాబాయి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో సత్యసాయి సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. సత్యసాయి సేవాదళ్ ఏపీ అధ్యక్షులు లక్ష్మణరావు స్టేట్ మహిళా సేవాదళ్ అధ్యక్షురాలు కిరణ్ కుమారి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మూర్తి జిల్లా మహిళా సేవాదళ్ విభాగపు జిల్లా కోఆర్డినేటర్ సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా 40 రోజులు పాటుటైలరింగ్ లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సీతారాములు స్కిల్ డెవలప్మెంట్ జిల్లా ఇన్ఛార్జి నిమ్మిలాల్, సత్యసాయి భక్తులు గంగాధర్, శివారెడ్డి బత్తలపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

కదిరి టౌన్ : ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీలలో కదిరి విద్యార్థులు ప్రతిభా చాటినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కదిరి కరాటే మాస్టర్ షాకిర్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనపర్చారు. 15 మంది విద్యార్థులు కటా, కుమిటే విభాగాలలో పోటీ చేయగా ఏడుగురు బంగారు, ఆరుగురు వెండి, మరో ఆరుగురుల బ్రాన్జ్ మెడల్స్ను సాధించారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కదిరి టౌన్ : కష్టపడి సంపాదించిన సంపదను పొదుపుగా వాడుకోవాలని ఎల్డిఎం సాయినాథ్ రెడ్డి, ఎపిఎం శారద సూచించారు.కదిరి రూరల్ పట్నం హై స్కూల్లో ఎల్డిఎం సాయినాథ్ రెడ్డి అధ్యక్షతన ఆర్థిక అక్షరాశ్యత అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాశ్యత కౌన్సిలర్ వీర మారుతి , నాగప్ప, కెనరా బ్యాంక్ మేనేజర్ మధు, లిటరసీ కోఆర్డినేటర్ రాజశేఖర్ వెలుగు యానిమేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

హిందూపురం : కొట్నూరు చెరువు మరువ వద్ద ప్రమాదాలు జరకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు గతంలో కురిసిన వర్షాల వల్ల కోట్నూరు మరువ చాలా రోజులుగ పారుతోంది. దీంతో ప్రదాన రోడ్డులో పాచి ఏర్పడి వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిని గమనించిన మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు సోమవారం పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఈవో

కదిరి టౌన్ : నల్లచెరువు మండలం శ్రీ పాలపాటిదిన్నే ఆంజనేయస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన రామాంజనేయులు సోమవారం స్థానిక ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎర్రదొడ్డి గంగమ్మ టెంపుల్ చైర్మన్ లక్ష్మీనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించండి

హిందూపురం : ఈ నెల 12న స్థానిక కోర్టు ఆవరణంలో జరిగే జాతీయ లోక్ అదాలత్లో అత్యధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని న్యాయమూర్తులు స్పందన, రాజ్యలక్ష్మి కోరారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్ అధికారులతో న్యాయమూర్తులను సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ గతంలో కంటే ఈ సారి అత్యధిక కేసులు పరిష్కారానికి కక్షిదారులను సమన్వయ పరచి చైతన్యవంతులు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో సిఐలు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, ఇస్మాయిల్, ఎపిపి నగేష్, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి

పుట్టపర్తి రూరల్ : పోలీస్ వ్యవస్థలో హోంగార్డుల పాత్ర ఎంతో కీలకమైనదని వీరు క్రమశిక్షణ నిబద్ధతతో మెలిగి ప్రజల మన్ననలు పొందాలని హోంగార్డ్ సౌత్రన్ రీజయన్ డిఎస్పి లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలోని హోంగార్డుల ఆధ్వర్యంలో నిర్వహించబడిన పరేడ్ను లక్షణరావు పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా హోంగార్డు ఆర్ ఐ శ్రీశైలం రెడ్డి, డిఎఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటాస్, ఎంటిఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు

ప్రమాద బాధ్యులపై చర్యలు

ప్రజాశక్తి నంబులపూలకుంట

మండల కేంద్రం పరిధి వంకమద్ది క్రాస్ వద్ద విద్యుత్ వైరు తెగి రైతు మృతిచెందిన ప్రమాదానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని విద్యుత్శాఖ ఎస్ఇ సురేంద్ర తెలిపారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు ప్రమాద స్థలాన్ని సోమవారం పరిశీలించారు. విద్యుత్శాఖ మండల అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఎస్ఇ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా విద్యుత్తీగ ఉన్న విషయాన్ని ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. క్రిందిస్థాయి సిబ్బంది విధినిర్వహణలో ఎలా వ్యవహరిస్తున్నారో గమనించకపోతే ఎలా అని ఎఇపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యుత్శాఖ అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎస్ఇ విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదం జరగడానికి గల కారణాన్ని విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మృతుడు రెడ్డప్పరెడ్డి కుటుంబానికి విద్యుత్శాఖ తరపున రూ. 5 లక్షలను పరిహారంగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్శాఖ ఎడి, డిఇ, ఎఇ తదితరులు పాల్గొన్నారు.

ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ నూతనభవనంలో మందుబాబుల నిర్వాకం

ప్రభుత్వ నూతన భవనాల్లో అసాంఘిక కార్యక్రమాలు

ప్రజాశక్తి రొద్దం

రాష్ట్ర ప్రభుత్వం మండలంలో నిర్మిస్తున్న నూతన భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారిపోయాయి. మండలంలోని రెడ్డిపల్లి సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. నూతనంగా నిర్మించిన ఈ భవనాలకు తలుపులు లేవు. ఈభవనాలు ప్రధాన రహదారికి సమీపంలో ఉండడంతో పాటు, గ్రామానికి దూరంగా ఉండడంతో రాత్రి వేళల్లో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతానికి కర్నాటక సరిహద్దు దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. దొడగట్టలో ఉన్న తనిఖీ కేంద్రం మూతపడడంతో ఇష్టారాజ్యంగా కర్నాటక మద్యం ఆంధ్రాలో కి తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. మద్యం ప్రియులు మందు, మాసం తీసుకుని ఈ నూతన భవనాలలో వంట చేసుకుని మద్యం తాగుతూ కాలక్షేపం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా ప్రస్తుతం వర్షాకాలం కావటంతో గొర్రెలు, మేకలు ఈ భవనాల్లోకి తీసుకువస్తున్నట్లు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆ భవనాలకు ప్రధాన ద్వారాలకు తలుపులు ఏర్పాటు చేయాలని, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

నిరసనలో నాయకులు, కార్మికులు

చిలమత్తూరు : స్వచ్ఛ భారత్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఖాళీపేట్లతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ప్రవీణ్ కుమార్, లక్ష్మినారాయణ, రామచంద్ర మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులతో నిత్యం పని చేయించుకుంటూ వేతనాలు చెల్లించకపోవటం దారుణమన్నారు, 6 నెలల నుండి 18 నెలలు వరకు వేతనాలు చెల్లించలేదన్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఎలా నడుస్తాయని ప్రశ్నించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం లోని స్పందనలో తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒం రామ్కుమార్, ఇఒఆర్డి సుభాషిణికి వినతి పత్రం అందజేశారు. 15 రోజులలో పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నాయకులు, కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికులు నారాయణప్ప, ఆదినారాయణ, నరసింహప్ప, తిప్పమ్మ, నంజమ్మ, ఆదెమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ను అందజేశారు. మండల వ్యాప్తంగా ఉన్న 71మంది స్వచ్ఛభారత్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫక్రుద్దీన్, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ నాయకులు రామాంజనేయులు, తిప్పన్న, మారుతి తదితరులు పాల్గొన్నారు .

ఓబుల దేవర చెరువు : స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి శ్రీ రాములు, మండల అధ్యక్షులు రమణ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం గా వ్యవహరించడం దారుణమన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం లోని స్పందనలో తహశీల్దార్ గోపాల్, ఎంపీడీవో పోలప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికులు నాగరాజు, పెద్ద నరసింహులు, గంగాద్రి, బాబు, భాగ్యమ్మ, పోలమ్మ, రమణమ్మ, సాలెమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు

హిందూపురం: పురపాలక సంఘాల్లో ఇంటింట చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన క్యాబ్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో క్యాబ్ ఆటో డ్రైవర్లు మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ధర్నా నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వినోద్కుమార్ మాట్లాడుతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీ కార్మికులకు ప్రతి నెల వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. వెంటనే క్యాబ్ ఆటో కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నరసింహప్ప, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి జగదీష్, కోశాధికారి ఆనంద్, ఉపాధ్యక్షులు రామాంజనప్ప, చంద్రశేఖర్, నాగేంద్ర, మల్లయ్య, సహాయ కార్యదర్శులు నారాయణమూర్తి, మంజునాథ్ కుమార్, రామచంద్ర, బాబయ్య, అంజి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఇన్ఛార్జి సూపర్వైజర్ పోస్టుల నియామకాన్ని నిలిపేయండి

వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

మడకశిర : ఐసిడిఎస్ ప్రాజెక్టులో చేపట్టిన సూపర్వైజర్ పోస్టుల నియామకాన్ని వెంటనే నిలిపివేసి రెగ్యులర్ సూపర్వైజర్ పోస్టులను నియమించాలని మడకశిర ఐసిడిఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో పనిచేస్తున్న అంగన్వాడీలు సోమవారం స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందజేశారు. ఈసందర్భంగా అంగన్వాడీ వర్కర్ల సంఘం నాయకులు శ్రీదేవి, పద్మావతి, ఉషారాణి తదితరులు మట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం సూపర్వైజర్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించిందని అన్నారు. అనంతరం చేపట్టిన నియామకాల్లో అక్రమాలు జరిగాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ నోటిఫికేషన్ రద్దు చేసి కొత్తగా రాత పరీక్ష నిర్వహించి నియమకాలు చేపట్టాలని కోరుతూ పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారన్నారు. అయితే కోర్టు తీర్పు వెలువడకనే ప్రభుత్వం తాత్కాలిక సూపర్వైజర్లను నియమించడానికి చర్యలు చేపట్టిందని విమర్శించారు. కోర్టు తీర్పు వెలువరించే వరకు ఇన్చార్జి సూపర్వైజర్ల నియామకం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకశిర ప్రాజెక్టు పరిధిలోని 5మండలాల కు చెందిన అంగన్వాడీ వర్కర్లుపాల్గొన్నారు.

పెనుకొండ : ఇన్ఛార్జి సూపర్వైజర్లు పోస్టులను నిలపుదల చేసి,రెగ్యులర్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలని పట్టణంలోని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ చిన్నపరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు బావమ్మ, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వరలక్ష్మి, మాబున్నీసా, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఐసిడిఎస్లో ఇన్ఛార్జ్ సుపర్వైజర్ పోస్టుల నియామకాలను వెంటనే నిలుపుదల చేసి, రెగ్యులర్ సూపర్ వైజర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్ వాడి కార్యకర్తలు ధర్నా చేసి, ఐసిడిఎస్ సుపర్వైజర్ శాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహప్ప, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శోభారాణి, సెక్టర్ లీడర్స్ ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మి, వెంకట నారాయణమ్మ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఇన్చార్జ్ సూపర్వైజర్ల పోస్టుల నియామకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సిడిపిఒ వరలక్ష్మికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్మోహన్, హరినాథ్ రెడ్డి, ముస్తాక్, ఫైరోజ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, రంగమ్మ, సుజాత, సరోజ, సువర్ణ, లక్ష్మీదేవి, పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ఓడి చెరువు : మండల పరిధిలోని ఎం కొత్తపల్లికి చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన అరుణ్ కుమార్ (22) గ్రామ సమీపంలోని గుట్ట కింద ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అరుణ్ కుమార్ గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడని ఆనొప్పిని భరించలేక ఉరి వేసుకున్నాడని మృతుని తండ్రి రమణప్ప తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

సచివాలయంలో కంప్యూటర్లు చోరీ

బుక్కపట్నం : మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి సచివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయం తలుపులు పగలగొట్టి రెండు కంప్యూటర్లు, , సెల్ఫోన్, స్కానర్, లామినేషన్ మిషన్ను ఎత్తుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ బైండోవర్

గుడిబండ : సత్య సాయి జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథను మడకశిర పోలీసులు సోమవారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా అరెస్టు చేసి మడకశిర పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. అనంతరం గుడిబండ తహశీల్దార్ మహబూబ్ పీరా ముందు మంజునాథను హాజరుపరచి బైండోవర్ చేసి విడుదల చేశారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తనకల్లు: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే పిపి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రెడ్డివారి పల్లి, గుంజువారిపల్లిలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూల నరసింహులు, ఎపిఎం వెంకటనారాయణ, విద్యుత్శాఖ ఎఇ శ్రీనివాసులు నాయుడుతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రం లోని చౌడేశ్వరి రైతు ఉత్పత్తిదారుల సేవా కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

అప్రజాస్వామిక చర్యలను వీడండి

ఎమ్మెల్యేకు మాజీ ఎమ్మెల్సీ హితవు

మడకశిర : అప్రజాస్వామిక చర్యలను విడనాడాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల నియామకంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భక్తార్, మండల కన్వీనర్లు మనోహర్ మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, కుమార్ స్వామి, దుర్గేష్, చంద్రప్ప నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆంధ్రప్రదేశ్ వికలాంగుల, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ కుమారి పటాన్ ముంతాజ్ తెలిపారు. సోమవారం స్థానిక సాయి ఆరామమంలో ఏర్పాటు చేసిన వికలాంగుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలను మారుమూల గ్రామాలకు వెళ్లి స్వయంగా చూస్తున్నానని, వీరి సమస్యలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ పథకాల వర్తింపులకు సంబందించి వేలిముద్రలు, ఐరిష్ పనిచేయని వికలాంగులు కనీసం పింఛను తీసుకోవటానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వికలాంగుల కంటే సకలాంగులు ఎక్కువగా సర్టిఫికెట్లు దళారుల ద్వారా తీసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ పోషణకు ఇబ్బంది పడకుండా అనంతపురంలో యూనిట్లు ప్రారంభించాలని ఆలోచిస్తున్నామని, త్వరలో కార్యరూపం దాల్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 3న ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కొన్ని కార్యక్రమాలు చేయాలనుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆయన సతీమణి అపర్ణ చేతుల మీదుగా వికలాంగులకు వినికిడి యంత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి కోఆప్షన్ సభ్యులు మహబూబ్, గ్రౌండ్ వాటర్ ఎడి రాజశేఖర్ రెడ్డి, అన్నదాత రామిరెడ్డి, పోగ్రాం ఆఫీసర్ అంజనమ్మ, ఆంధ్రప్రదేశ్ వికలాంగుల పోరాట సమితి అధ్యక్షుడు ఎంపీ షఫీ, సత్యసాయి జిల్లా అధ్యక్షులు రామాంజి, ఉపాధ్యక్షులు దేవిబాయి తదితరులు పాల్గొన్నారు.

ఇతరులను ఎస్టీజాబితాలో చేరిస్తే సహించం

పుట్టపర్తిఅర్బన్ : ఇతర సామాజిక వర్గాలకు ఎస్టీ జాబితాలో చేర్చితే సహించేది లేదని రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు ఉధతం చేస్తామని గిరిజన, ఎరికల సంక్షేమ సంఘాలు హెచ్చరించాయి. సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఎరికల సంఘం నాయకులు స్థానిక సత్యమ్మ గుడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు జీవో 52ను రద్దు చేయాలంటూ నినాదాలు చేస్తూ కలెక్టరేట్ ముందు బైటాయించి నిరసన తెలిపారు. రాష్ట్ర ఎరికల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి దేవరకొండ ఉమాశంకర్, అనంతపురం, సత్యసాయి జిల్లాల అధ్యక్షులు సాకే గోవిందు, బిజిలి గంగులప్ప మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా గిరిజన ఎరికల కులస్తులు ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. అన్ని విధాల అభివద్ధి చెందిన ఇతర సామాజిక వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చితే తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. ముఖ్యమంత్రి తమ సంఘాల నాయకుల తో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే 52 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ బసంత్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ఎరికల శంకర్, వెంకట రాముడు, ఎరికల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శారదమ్మ, హరిలాల్ నాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ముత్యాలప్ప, కెబి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్యాయాన్ని ప్రశ్నిస్తే అరెస్టులా..? : టిడిపి

గుడిబండ : మడకశిర నియోజకవర్గంలోజరిగిన అన్యాయాన్ని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ ప్రశ్నిస్తే అతనిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని టిడిపి నాయకులు అన్నారు. మంజునాథ్ అరెస్టు విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున గుడిబండ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు డాక్టర్ సునీల్, న్యాయవాది మంజు, నాయకులు రాధాకృష్ణ, శివకుమార్, దుర్గేష్, ముద్దనకుంటప్ప, జయరాం తదితరులు మాట్లాడుతూ వైసిపి నాయకుల వైఖరిని ఎండగట్టారు.

కదిరి టౌన్ : టిడిపి ఎస్సి జిల్లా అధ్యక్షులు మంజునాథని తక్షణం విడుదల చేయాలని రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కందికుంట నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మడకశిర ఐసిడిఎస్ ప్రాజెక్టు లో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తే అరెస్టు చేయడం అమానుషమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిగాళ్ల ప్రకాష్, వెంకటరమణ గంగాద్రి, లక్ష్మన్న, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని టిడిపి నాయకులు అన్నారు. సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ను మడకశిర పోలీసులు అరెస్టు చేయడాన్ని ఓడిసి టిడిపి నాయకులు ఖండించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సూపర్వైజర్ల నియామకంలో జరిగిన అవినీతిని ప్రశ్నిస్తున్న తమ నాయకుడు మంజునాథ్ అరెస్టు చేయడం దారుణమన్నారు. దళిత నాయకులపై దాడులు అరెస్టులు తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మంజునాథ్ను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్. గంగాద్రి, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో వినతుల వెల్లువ

ఎస్పీకి సమస్యను విన్నవిస్తున్న బాధితురాలు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్యసాయి జిల్లా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎసీప రాహుల్ దేవ్ సింగ్ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతులు వెల్లువెత్తాయి. ఈసందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలను ఎస్పీ ముందు విన్నవించారు. ధర్మవరంలోని గాంధీనగర్ కు చెందిన వై అనూష అనే మహిళ తనకు జరుతున్న అన్యాయాన్ని వివరించారు. తన భర్త సురేష్ ఇటీవలే మృతిచెందాడని ఈ నేపథ్యంలో తన బావన ఆడపడచు తనను చిత్రహింసలకు గురి చేస్తున్నారని వాపోయారు. తనకు ఇద్దరు కుమార్తెలని వారి జీవనాధారానికి ఏమీ ఇవ్వకుండా ఇంటి నుండి వెళ్లగొట్టడానికి చూస్తున్నారని తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని ఆమె ఎస్పీ ముందు కన్నీరు మున్నీరయ్యారు. ఇలాగే పలువురు బాధితులు తమ సమస్యలను ఎస్పీ ముందు విన్నవించుకున్నారు. రస్తా వివాదాలు, కుటుంబ కలహాలు, అదనపు కట్నం కోసం అత్తారింటి వేదింపులు, ఉద్యోగ మోసాలు, భూవివాదాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు ఇలా తమకున్న సమస్యలను ఎస్పీ ముందు విన్నవించారు. పోలీసు పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఎస్బి డిఎస్పి ఉమ మహేశ్వర రెడ్డి, సిఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : రిలయన్స్ డిజిటల్ పైన, 2వ ఫ్లోర్, సుభాష్రోడ్డు, క్లాక్టవర్ దగ్గర, అనంతపురం.
చలపతి ఎన్క్లేవ్, ఫస్ట్ఫ్లోర్, పరిగీల్ బస్టాప్ దగ్గర, హిందుపూర్
యాదవ స్ట్రీట్ మెయిన్రోడ్డు, సబ్జైల్ ఎదురు, ధర్మవరం
రాయదుర్గం :లక్ష్మీబజార్, అనంతపురం మెయిన్రోడ్డు, ఎపిజిబి బ్యాంక్ దగ్గర,రాయదుర్గం

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25.11.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1592.93 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798